క్లుప్తంగా

మెగా పీటీఎంకు ఏర్పాట్లు



తాము తయారు చేసిన ఆహ్వాన పత్రాలతో విద్యార్థులు

సీతంపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవీఎంసీ పాఠశాలల్లో శనివారం జరగనున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్, సీతంపేట మధురానగర్‌లో గల జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మీటింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సమావేశానికి హాజరు కావాలంటూ పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేకంగా ఆహ్వానాలు అందించారు. పిల్లలే ఆహ్వానాలు సిద్ధం చేశారు. సమావేశానికి వచ్చే అతిథులకు ఇవ్వడానికి రంగురంగుల పేపర్లతో బొకేలు సిద్ధం చేశారు. పిల్లలతో పాటు, తల్లిదండ్రులకు భోజనాలు ఏర్పాటు చేసినట్టు హెచ్‌ఎంలు తెలిపారు.

ఉన్నత పాఠశాల వాష్‌రూంలకు కొత్త తలుపులు

సీతమ్మధార: స్థానిక పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల వాష్‌రూంలకు కొత్త తలుపులు ఏర్పాటు చేశారు. పాఠశాలలోని వాష్‌రూంలకు ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన తలుపులు కాలక్రమంలో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాల అభివృద్ధి నిధుల నుండి రూ.30 వేలు వెచ్చించి కొత్తగా ఏడు తలుపులు సిద్ధం చేశారు. కొద్ది రోజులుగా కార్పెంటర్ల ద్వారా జరుగుతున్న పనులు శుక్రవారంతో పూర్తయ్యాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ పర్యవేక్షణలో పనులు పూర్తి చేశారు.

'టెండర్లు ఎవరికి ఇచ్చినా అడ్డుకుంటాం'

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రి టెండర్లు ఎవరికి వచ్చినా అడ్డుకుని తీరుతామని సీఐటీయూ అధ్యక్షుడు జె. సత్యనారాయణ హెచ్చరించారు. పోర్టు ఆస్పత్రి ఎదురుగా జరుగుతున్న రిలే నిరాహారదీక్షల 67వ రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యంతో ముడిపడిన సేవలను ప్రైవేటు వారికి అప్పగించడం తగదు అన్నారు. నవంబరు 8వ తేదీన టెండర్లు పిలుస్తారని, అనంతరం 18వ తేదీ అని, 28వ తేదీ అని, డిసెంబరు 5వ తేదీ అని ఇప్పుడు 12వ తేదీ అని వాయిదాలు వేస్తున్నారని, ఇది తమ పోరాట ఫలితమని సత్యనారాయణ తెలిపారు. సీఐటీయూ నాయకులు కె. సత్యనారాయణ, ఈశ్వర్రావు, బి. లక్ష్మణరావు, రామలింగేశ్వర్రావు, సీహెచ్ త్రినాథరావు, కేఎస్ కుమార్, శ్రీను, రాఘవులు, కె. విజయారావు, రెడ్డి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

జోన్-3 కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

సీతమ్మధార: ఆశీలమెట్ట అశోక్‌నగర్‌లో గల జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. కొద్ది రోజులుగా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇక్కడి కార్యాలయంలోని జీ+2 అంతస్తులో పలు విభాగాలు ఉన్నాయి. వాటితో పాటు మొత్తం 31 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని జోనల్‌కమిషనర్ కె.శివప్రసాద్ శుక్రవారం 'సాక్షి'కి తెలిపారు. ఈ కార్యాలయానికి తూర్పు, ఉత్తర నియోజకవర్గం (పోర్టు) పరిధిలోని ప్రజలు పలు పనుల నిమిత్తం వస్తుంటారు.

ఆకట్టుకుంటున్న క్రైస్తవ పుస్తక ప్రదర్శన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు పరిధి, రెల్వేన్యూకాలనీలో గల లేమెన్స్ ఇవాంజలికల్ ఫెలోషిప్ (ఎల్‌ఈఎఫ్) చర్చి ప్రాంగణంలో బ్యూటిఫుల్ బుక్స్ ఆధ్వర్యంలో అతి పెద్ద క్రైస్తవ పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ పుస్తక ప్రదర్శన డిసెంబరు 2వ తేదీ నుండి ఇక్కడ ప్రాంభమైంది. నేడు, రేపు కూడా కొనసాగనుంది. ఈ పుస్తక ప్రదర్శనలో క్రైస్తవ ఆధ్యాత్మిక అభివృద్ధికి అవసరమైన వివిధ భాషల బైబిల్స్, కామెంట్రీలు, క్రైస్తవ రచనలు, భక్తుల జీవిత చరిత్రలు, పిల్లలు, స్త్రీలు, యౌవనస్థులకు అవసరమైన కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. డిసెంబరు 8వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 9 నుండి రాత్రి 9 గంటల వరకు ఉంటుంది.

ఆక్రమణల చెరలో ప్రభుత్వ స్థలాలు



26వ వార్డులో ప్రభుత్వ స్థలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డు (నాడు)



25వ వార్డులోని ప్రభుత్వ స్థలంలో కడుతున్న అక్రమ నిర్మాణం

సీతంపేట:

నియోజకవర్గం పరిధిలో రెవెన్యూ, జీవీఎంసీ స్థలాలకు రక్షణ కరవైంది. అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో ఎంతో విలువైన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. విలువైన ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన రెవెన్యూ, జీవీఎంసీ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. పరిరక్షణకు చర్యలు తీసుకోకపోవడంతో కోట్ల విలువైన స్థలాలు ఆక్రమణదారుల చేతుల్లోకి పోతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేలా ఫెన్సింగ్, ప్రభుత్వ స్థలమని గుర్తించేలా బోర్డులు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫెన్సింగ్‌లు మాయమయ్యాయి.

రెవెన్యూ స్థలం కబ్జా..

జీవీఎంసీ 25వ వార్డు కనకమ్మవారి వీధిలో సుమారు రెండు వేల గజాల ఖాళీ స్థలం ఉంది. ఎన్నో సంవత్సరాల నుంచి దీనిని ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఈ స్థలంపై కబ్జాదారుల కన్నుపడింది. స్థానికులు కొంత మంది కలిసి ఈ స్థలాన్ని హైదరాబాదుకు చెందిన వ్యక్తికి విక్రయించారని, ప్రస్తుతం ఆ వ్యక్తి అనకాపల్లి జిల్లాకు చెందిన మరి కొందరికి విక్రయించారని జోరుగా ప్రచారం జరుగుతోంది. దానిలో భాగంగా కొనుక్కున్న వారి అనుచరులు కొద్ది రోజుల కిందట స్థలంలో ఉన్న రెవెన్యూ బోర్డును మాయం చేశారు. రాత్రిపూట, సెలవు దినాల్లో గోడలు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 60 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం కూడా జరుగుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత సచివాలయ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నుండి ఎటువంటి చర్యలు లేవు. నాలుగు రోజుల కిందట స్థానికుల ఫిర్యాదుతో ఆర్ఐ ప్రేమలత సంఘటనా స్థలానికి వచ్చి అక్రమ నిర్మాణాన్ని నిలిపేశారు. తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి రెవెన్యూ స్థలమని, ఆక్రమిస్తే చట్టరీత్యా నేరమని తెలిపే విధంగా బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ రెవెన్యూ స్థలంలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. స్థలానికి సంబంధించిన పత్రాలు ఉంటే చూపించాలని, లేదంటే నిర్మాణాలు ఆపివేయాలని తెలిపినట్టు సమాచారం.



కనకమ్మ వీధిలో రెవెన్యూ స్థలం (ఫైల్)

గత ప్రభుత్వ హయాంలో రక్షణ చర్యలు..

గతంలో కొంతమంది ఈ స్థలంలో కొంత భాగాన్ని ఆక్రమించే ప్రయత్నం చేశారు. స్థానికుల ఫిర్యాదుతో ప్రభుత్వానికి చెందిన స్థలమని, ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అప్పటి అర్బన్ ఎమ్మార్వో ఆధ్వర్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ స్థలంలో సామాజిక భవనం, కళ్యాణ మండపం ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఎప్పటి నుంచో పలువురు కోరుతున్నారు. కనీసం స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు, రక్షణ గోడలు లేకపోవడంతో ఖాళీ స్థలంలో చెత్తా చెదారం పడేస్తుండడంతో నివాసితులు ఇబ్బంది పడుతున్నారు.

ఫెన్సింగ్ మాయం..

జీవీఎంసీ 26వ వార్డు శాంతిపురంలో పద్మశ్రీ ఆస్పత్రి వద్ద 120 గజాల ప్రభుత్వ స్థలం ఉంది. దీని విలువ సుమారు రెండు కోట్లు ఉండవచ్చని సమాచారం. ఇంత విలువైన స్థలాన్ని జీవీఎంసీ పట్టించుకోకపోవడంతో గతంలో ఒక వ్యక్తి ఆవులు కట్టే నెపంతో స్థలాన్ని ఆక్రమించి నాలుగేళ్ల పాటు తన ఆధీనంలో ఉంచుకుని షెడ్డు నిర్మించడం ప్రారంభించాడు. స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జీవీఎంసీ యంత్రాంగం స్పందించి ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసి రక్షణ కల్పించింది. ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కంచె ధ్వంసమైంది. బోర్డు మాయమైంది. ఆక్రమణలకు మార్గం తెరిచినట్టయింది. ఇప్పటికైనా రెవెన్యూ, జీవీఎంసీ యంత్రాంగం ప్రభుత్వ స్థలాలపై సర్వే నిర్వహించి రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు



26వ వార్డులో ప్రభుత్వ స్థలానికి ఫెన్సింగ్ వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం (నాడు)



26వ వార్డులో ప్రభుత్వ స్థలంలో మాయమైన ఫెన్సింగ్ (నేడు)

ఫ్రిజ్‌లు, ఏసీల తొలగింపు



ఫ్రిజ్‌లు, ఏసీలు తొలగించిన తర్వాత

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: లలితానగర్‌లో రహదారిని ఆక్రమించిన ఫ్రిజ్‌లు, ఏసీ మిషన్లు తొలగించారు. ఇక్కడి ఓ షోరూం వ్యాపారి తన షాపు పక్కన ఉన్న రోడ్డుకు రెండు వైపుల పాత ఫ్రిజ్‌లు, ఏసీ మిషన్లను పెట్టడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. జనావాసాల మధ్య వందల సంఖ్యలో పాత ఫ్రిజ్‌లు, ఏసీలు పడేయడంతో ఏదైనా కంప్రెషర్ పేలితే ప్రమాదమని, అలాగే వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోందని స్థానికుల ఇబ్బందులను 'గొడౌన్ కాదు...రోడ్డే...!' శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీస్ అధికారులు స్పందించారు. వార్త ప్రచురించిన రోజే రోడ్డును ఆక్రమించిన ఫ్రిజ్‌లు, ఏసీ మిషన్లు లారీలలో తరలించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30కు బాలభోగం, 9.30కు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30కు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30కు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇస్తారు.

సౌందర్యలహరి పుస్తకావిష్కరణ

సీతంపేట: విశాఖ సాహితీ ఆధ్వర్యంలో రచయితలు అత్రేయపురపు పాండురంగ విఠల్ ప్రసాద్, వేదుల కామేశ్వర శర్మ సంయుక్తంగా శ్రీశంకరాచార్య విరచిత సౌందర్యల హరి అనుసృజన పుస్తకావిష్కరణ సభ లలితానగర్‌లోని శ్రీలలితాపీఠంలో జరిగింది. ప్రముఖ శతక పద్య కవి కంటి శంకరయ్య ముఖ్య అతిథిగా హాజరై పుస్తకావిష్కరణ చేశారు. విశాఖ సాహితి అధ్యక్షురాలు కందాల కనక మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.వి. సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. సాహితీవేత్తలు పింగళి జానకి, పరవస్తు పద్యపీఠం అధ్యక్షుడు ఫణిశయన సూరి, విశాఖ సాహితి కార్యదర్శి శంకర్ నీలు భాగవతుల, వేదుల శ్రీనాథ శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాఖ సాహితీ అధ్యక్షురాలు కనకమహాలక్ష్మి

కులశేఖర్ మరణం తీరని లోటు

సీతంపేట: సినీ గేయ రచయిత కులశేఖర్ మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు అని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం సంస్మరణ సభ నిర్వహించారు. ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, అధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సింహాచలంలో జన్మించి, బీవీకే కళాశాలలో డిగ్రీ చదివి, గేయ రచయితగా పేరు సంపాదించారని కొనియాడారు. కులశేఖర్ గురువు వై.సత్యారావు మాటాడుతూ కులశేఖర్ చాలా చురుకైన విద్యార్థి అని, ఆయన ప్రతిభ గుర్తించి సిరివెన్నెల సీతారామ శాస్త్రికి సిఫారసు చేశానన్నారు. అనతి కాలంలోనే కీర్తి గడించాడన్నారు. సహ విద్యార్థి లోగిస లక్ష్మీనాయుడు మాట్లాడుతూ సుమారు వందకు పైగా పాటలు రాసి బహుముఖ ప్రతిభ కనబరిచారని అన్నారు.



కులశేఖర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సొసైటీ ప్రతినిధులు

రైల్వే పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్. రామారావు, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ జాలి కర్మాకర్ సిబ్బందితో కలిసి శుక్రవారం రైల్వేస్టేషన్ వివిధ ప్లాట్‌ఫాంలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో తమిళనాడు రాష్ట్రం, మధురై జిల్లాకు చెందిన రమార్ సెల్లం అక్రమంగా గంజాయి రవాణా చేయడం గుర్తించి, అతన్ని అదుపులోకి తీసుకుని ఎస్‌ఐ రామారావుకు అప్పగించారు. ఇతని వద్ద నుండి రూ. 86 వేల విలువైన 17.3 కేజీల గంజాయిని సీజ్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్‌పీ సిబ్బంది తెలిపారు.



గంజాయి నిందితుడితో రైల్వే పోలీసులు

మంత్రి సత్యకుమార్‌కు సమస్యలపై వినతి

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లో గల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సమస్యలపై వార్డు కార్పొరేటర్ గంకల కవిత శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ కవిత తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కవిత

అవయవ దానంతో పునర్జన్మ

సీతంపేట: సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అఖిలభారత అవయవ దాతల సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు అపోహలు వీడి అవయవ దానం చెయ్యడానికి ముందుకు రావాలన్నారు. తద్వారా మరణించి కూడా జీవించవచ్చన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయదానం చేస్తే మరి కొందరు రోగులకు పునర్జన్మ ఇచ్చిన వారవుతారని తెలిపారు. అవయవ దానం చేసిన వారికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేస్తారని తెలిపారు. ఇతర ప్రోత్సాహకాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశేష సేవలందిస్తున్న వారిని సత్కరించారు.

అంబేడ్కర్ స్ఫూర్తి మరువరానిది

- రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి



అంబేడ్కర్‌కు నివాళులు అర్పించిన పోర్టు అధికారులు, ఉద్యోగులు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్‌లీడర్ పెనుమత్స విష్ణుకుమార్‌రాజు రాజ్యాంగ నిర్మాతకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో శ్యామల దీపిక తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 51వ వార్డులో..

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు వైసీపీ కార్యాలయంలో శుక్రవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. పైడి శ్రీను, బి.తిరుమలరావు, సారిక నూకరాజు, పొన్నాడ అప్పారావు, కరిమిరెడ్డి శ్యామ్ పాల్గొన్నారు.

కార్గో హేండ్లింగ్ డివిజన్ ఆధ్వర్యంలో..

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్టు అథారిటీ ట్రాఫిక్ మేనేజర్, ఇన్‌చార్జి జి. రామ్ శేఖర్ యాజి అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. కార్గో హేండ్లింగ్ డివిజన్ (ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్-వీపీటీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. కోటేశ్వర్రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సీహెచ్‌డీ సీనియర్ డీటీఎం సీహెచ్ అవతారం నాయుడు, డీటీఎం బీకే పట్నా నాయక్, కార్గో హేండ్లింగ్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్. ప్రవీణ్‌కుమార్, బీబీ పడాల్, జనరల్ సెక్రటరీ పి. లింగమూర్తి, పి. సత్తిబాబు, సీహెచ్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



51వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న వెంకటరమణ తదితరులు

డీఆర్‌ఎం కార్యాలయంలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహా పరినిర్వాణ్ దినోత్సవం దొండపర్తిలో గల డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో డీఆర్‌ఎం మనోజ్‌కుమార్‌సాహు ఆధ్వర్యంలో జరిగింది. అంబేడ్కర్‌కు ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం (ఇన్‌ఫ్రా) ఈ. శాంతారాం, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై సమీక్ష



మాట్లాడుతున్న కమిషన్ సభ్యులు సీతారామ్

సీతంపేట: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా జిల్లా కార్మిక శాఖ అధికారులు ప్రణాళికాయుతంగా చేపడుతున్న చర్యలపై ఆరా తీసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం, ఆదిలక్ష్మి, త్రిపర్ణ శుక్రవారం అక్కయ్యపాలెంలోని కార్మిక శాఖ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎం.సునీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో నగరం, జిల్లాలో పట్టుబడ్డ బాల కార్మికులపై ఆరా తీసి, రికార్డులు పరిశీలించారు. పట్టుబడ్డ పిల్లల భవిష్యత్‌కు చేపట్టిన చర్యలు అడిగి తెలుసుకున్నారు. కమిషన్ ఆదేశాలు పాటించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తామని డిప్యూటీ లేబర్ కమిషనర్ సునీత అన్నారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్లు రాజు, రమాదేవి, గోవింద్, లేబర్ ఆఫీసర్లు, జిల్లా బాలల సంరక్షణ అధికారి లక్ష్మి, ఐసీపీయూ ప్రతినిధులు మమత, ఆనంద్, శకుంతల పాల్గొన్నారు.

పంచగ్రామాల సమస్య ఓ కొలిక్కి

సీతమ్మధార: విశాఖలో ఏళ్ల తరబడి పీడిస్తున్న పంచ గ్రామాల సమస్య ఓ కొలిక్కి వచ్చిందని, త్వరలోనే పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు తెలిపారు. సీతమ్మధారలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. యూఎల్‌సీ భూముల కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. గురుద్వార సమీపంలో గతంలో రాజీవ్ ఆస్పత్రి కోసం తీసుకున్న సుమారు రెండెకరాల స్థలంలో కమర్షియల్ నిర్మాణాలు చేయడంపై తన దృష్టికి రాగా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశానని గుర్తు చేశారు. సీతంపేటలో పలు చోట్ల 22ఏ సమస్య ఉందని, రిజిస్ట్రేషన్లు పూర్తయిన తర్వాత తాము వారసులం అంటూ వస్తున్నారని అది చెల్లదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రెవెన్యూ సదస్సులో ప్రజలు ఫిర్యాదులు చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. సదస్సుకు మొత్తం 13 ఫిర్యాదులు అందాయి. తహశీల్దార్ ఎం. రమేష్, నోడల్ అధికారి ఎం.సత్యపద్మ, డిప్యూటీ తహశీల్దార్ త్రినాథరావు, 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్, 24వ వార్డు టీడీపీ అధ్యక్షులు బర్ల పద్మలత, ముక్కా కిశోర్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, తహశీల్దార్ రమేష్

రైతుబజారులో స్టాళ్లకు డ్రా

సీతమ్మధార: స్థానిక రైతుబజారులో శుక్రవారం రైతు బజార్ స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం 90, సాయంత్రం 70 దుకాణాలకు డ్రా తీసి ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతివారం రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జల సంరక్షణలో ఏపీ ఫెర్వాస్‌కు గుర్తింపు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ మూర్తి, దుర్గాప్రసాద్

తాటిచెట్లపాలెం: ఆంధ్రప్రదేశ్ కాలనీ నివాసితుల సంక్షేమ సంఘ సమాఖ్య (ఏపీ ఫెర్వాస్) విశాఖకు జలసంరక్షణలో చేసిన కృషికి ఇండియా వాటర్ ఫౌండేషన్ (న్యూఢిల్లీ) గుర్తింపు లభించింది. ఈ మేరకు వివరాలను ఫెర్వాస్ సహాయ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్‌ఆర్ మూర్తి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. డిసెంబరు 5,6 తేదీల్లో న్యూఢిల్లీలో జల సంరక్షణపై జరిగిన అంతర్జాతీయ సమావేశంలో ఏపీ ఫెర్వాస్‌కు వాటర్ వెర్సాలిటీ గ్లోబల్ బహుమతి లభించిందన్నారు. డిసెంబర్ 6 శుక్రవారం సాయంత్రం న్యూఢిల్లీలో సహ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్‌ఆర్ మూర్తి, జనరల్ సెక్రటరీ ఎం. దుర్గాప్రసాద్ ట్రోఫీ, ప్రశంసా పత్రం అందుకున్నట్లు తెలిపారు.

ఘనంగా సివిల్ డిఫెన్స్ వేడుకలు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో 62వ సివిల్ డిఫెన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశాఖలో గల జోనల్ సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ సెంటర్‌లో డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ సమక్షంలో పలు ప్రత్యేక కార్యక్రమాలను సివిల్ డిఫెన్స్ సభ్యులు నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాద ఘటనలు, అత్యవసర పరిస్థితుల్లో సివిల్ డిఫెన్స్ బృంద సభ్యులు కీలకపాత్ర పోషిస్తున్నారని డీఆర్‌ఎం ప్రశంసించారు. ఈ సందర్భంగా సీనియర్ డివిజినల్ సేఫ్టీ అధికారి సిద్ధార్థ్ ప్రధాన నేతృత్వంలో అగ్ని ప్రమాద సమయంలో ఎలా తప్పించుకోవాలో సభ్యులు మాక్ డ్రిల్ ద్వారా తెలిపారు. అనంతరం మెడికల్ డిపార్ట్‌మెంట్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా రాష్ట్రపతి సందేశాన్ని డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ చదివి వినిపించారు. కార్యక్రమంలో సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ కేవై రెడ్డి, ఏడీఆర్‌ఎం (ఇన్‌ఫ్రా)ఈ. శాంతారాం, సీనియర్ డివిజినల్ సేఫ్టీ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్ ద్వారా అగ్ని ప్రమాదాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేస్తున్న సభ్యులు